



ఉత్తమ ఉపాధ్యాయులు : ఆరంగి అప్పన్న, బి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు

గురువులకు గుర్తింపు

- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ముగ్గురు ఎంపిక
- రేపు విజయవాడలో అవార్డుల ప్రదానం

నరసన్నపేట/ గుజరాతీపేట/ లావేరు/ బూర్జ, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రకటించింది. ఈ అవార్డులకు జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ప్రకటించాలి. కానీ అప్పట్లో విజయవాడలో వరద ముంపు కారణంగా అవార్డుల ప్రక్రియ వాయిదా పడింది. తాజాగా శనివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 11న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేయనున్నారు.

- నరసన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బోటనీ లెక్చరర్ ఆరంగి అప్పన్నను ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేస్తూ.. ఉన్నత విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పన్న మాస్టర్ 2008లో ఉద్యోగంలో చేరారు. టెక్కలి, నరసన్నపేట, కొటబొమ్మాళిలో పనిచేశారు. బోటనీలో వరుసగా పదేళ్ల శతశాతం విద్యార్థుల ఉత్తీర్ణత సాధించేలా కృషి చేశారు. ఇందుకు గుర్తింపుగా.. తనకు ఈ అవార్డు వరించినట్లు అప్పన్న మాస్టర్ తెలిపారు.
- అలాగే బూర్జ మండలం ఓవీ పేట స్కూల్ ప్రినిపాల్ బి.శ్రీనివాసరావు, లావేరు మండలం గోవిందపురం ఎంపీపీ స్కూల్ ఎస్జీటీ జి.శ్రీనివాసరావును ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. జి.శ్రీనివాసరావు స్వగ్రామం గార మండలం అంపోలు. విద్యాబోధనలో కృషితో పాటు 18ఏళ్లుగా స్టేట్ రీసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నానని శ్రీనివాస్ తెలిపారు. 24 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా చేసిన సేవలకు తనకు గుర్తింపు లభించడం ఆనందంగా ఉందన్నారు. ఓవీ పేట ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేశానని తెలిపారు. తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

నామినేటెడ్ సందడి



కొరికాన రవికుమార్

రోణంకి కృష్ణంనాయుడు

- 'సుడా' చైర్మన్‌గా కొరికాన రవికుమార్
- కళింగ కార్పొరేషన్ అధ్యక్షుడిగా రోణంకి కృష్ణంనాయుడు నియామకం

శ్రీకాకుళం/ నరసన్నపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం శనివారం రెండో విడత నామినేటెడ్ పదవుల జాబితాను విడుదల చేసింది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి కీలకంగా వ్యవహరించిన టీడీపీ, జనసేన శ్రేణులకు వివిధ పదవులను ప్రకటించింది. ఇందులో భాగంగా జిల్లాలో ఆ రెండు పార్టీల నుంచి ఒక్కొక్కరికీ నామినేటెడ్ పదవులు లభించాయి. శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) చైర్మన్‌గా జనసేన నేత కొరికాన రవికుమార్‌ను నియమించింది. అలాగే కళింగ కార్పొరేషన్ చైర్మన్ పదవిని రోణంకి కృష్ణంనాయుడికి కేటాయించింది. కాగా.. శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధిక మంది టీడీపీ సీనియర్ నేతలు సుడా చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఈ పదవిని జనసేనకు కేటాయించడంతో ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. త్వరలో విడుదల కానున్న ఇతర కుల సంఘాలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంటి పదవులైనా లభిస్తాయో లేదోనని ఆశగా ఎదురుచూస్తున్నారు.

● పాతపట్నం టికెట్ ఆశించిన కొరికాన..

సార్వత్రిక ఎన్నికల్లో పాతపట్నం నియోజకవర్గం నుంచి జనసేన తరఫున కొరికాన రవికుమార్ టికెట్ ఆశించారు. అధిష్ఠానం వద్ద తన భార్య భవానీ పేరును ప్రతిపాదించారు. కూటమి సర్దుబాటులో టిక్కెట్ లభించలేదు. రవికుమార్ స్వస్థలం వీరఘట్టం మండలం పనసనందివాడ గ్రామం. ఆయనకు ఎల్.ఎన్.పేట మండలంతోనూ చుట్టరికం ఉంది. ఈయన పారిశ్రామికవేత్తగా ఎదిగి పాండిచ్చేరిలో మెరైన్ హేచరీస్ నిర్వహిస్తూ ఓ ప్రఖ్యాత స్థానంలో ఉంటూ జనసేనలో చేరారు. సార్వత్రిక ఎన్నికల్లో పాతపట్నంలో కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. అలాగే ఆయన సతీమణి భవానీ సేవాకార్యక్రమాలు నిర్వహించడంతోపాటు.. డీఎస్సీ అభ్యర్థుల కోసం ఉచితంగా కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా సుడా చైర్మన్‌గా నియమించడంతో కొరికాన రవికుమార్ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● క్రియాశీలక కార్యకర్తగా రోణంకి

నరసన్నపేటకు చెందిన న్యాయవాది రోణంకి కృష్ణంనాయుడు.. టీడీపీలో క్రియాశీలక కార్యకర్తగా వ్యవహరించారు. ఈయన స్వగ్రామం పోలాకి మండలం ఉరజాం. 30 ఏళ్లుగా నరసన్నపేట గాంధీనగర్‌లో ఉంటున్నారు. గతంలో పోలాకి జడ్పీటీసీగా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ పార్టీని వీడి ప్రస్తుత ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి స్ఫూర్తితో టీడీపీలో చేరారు. అనాటి నుంచి రమణమూర్తి ముఖ్య అనుచరుడిగా పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో టీడీపీ నాయకులపై అక్రమ కేసులను బదలాయించే సమయంలో బాధితులకు అండగా నిలిచారు. ప్రస్తుతం స్థానిక సివిల్ కోర్టులో న్యాయవాదిగా, టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో.. సీఎం చంద్రబాబు అప్పగించిన బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తానని రోణంకి తెలిపారు. కాళింగుల సంక్షేమానికి కృషి చేస్తానని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుతోపాటు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.



వరికోత యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం తెస్తాం

- రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- మంత్రి అచ్చెన్నాయుడు ● కిసాన్ మేళా ప్రారంభం

6 లో



వేతనాలు వచ్చాయ్..

- ఆనందంలో 108, 104, 102 వాహన సిబ్బంది

8 లో



బుచ్చిపేట వద్ద భారీస్థాయిలో ఇసుక నిల్వలు

ఉచితం మాటున.. ఇసుక దోపిడీ

- పగలు డంపింగ్.. రాత్రి లారీలకు లోడింగ్
- మడపాంలో ట్రాక్టర్లకు బలవంతపు వసూళ్లు
- అక్రమ రవాణాలో చక్రం తిప్పుతున్న ముఠా

నరసన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం.. అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. నరసన్నపేట మండలం మడపాం, బుచ్చిపేట గ్రామాల్లో నదితీరంలో పగలు ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. రాత్రివేళల్లో యంత్రాలతో లారీలకు, టిప్పర్లకు లోడింగ్ చేస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు ఒక్కటై ఇసుక దందా నిర్వహిస్తున్నారు. మడపాం కేంద్రంగా విశాఖపట్నం, యలమంచిలి, అనకాపల్లికి రోజూ రాత్రిపూట మూడు స్పాట్‌ల నుంచి వందల సంఖ్యల లారీలతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఒక్కో లారీ నుంచి రూ.20 వేల నుంచి రూ.25 వేలు చొప్పున ముఠా సభ్యులు వసూళ్లు చేస్తున్నారు.

- ప్రభుత్వం ఉచితంగా ఎక్కడ నుంచైనా ఇసుకు తీసుకునేలా వెసులుబాటు కల్పించింది. దీంతో నరసన్నపేట మండలంలో బుచ్చిపేట, మడపాం, లుకలాం, ఉప్పరిపేట, శ్రీకాకుళం మండలం బైరి, కరజాడ, రోణంకి, బట్టేరు, పొన్నాం తదితర ప్రాంతాల నుంచి ఇసుకను ట్రాక్టర్లతో గృహ అవసరాలు తీసుకెళ్తున్నారు. ఇదే అదనుగా గతంలో ఇసుక అక్రమ రవాణా చేసిన ముఠా సభ్యులు స్థానిక నాయకులతో చేతులు కలిపారు. బుచ్చిపేట నదితీరంలో తోటలు వద్ద గత వారం రోజుల నుంచీ భారీగా ఇసుకను డంపింగ్ చేస్తున్నారు. రాత్రి సమయంలో లారీలకు లోడింగ్ చేసి అక్రమ రవాణా చేస్తున్నారు. మడపాంలో కూడా మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. నేరుగా ఇసుకను ట్రాక్టర్లతో తీసుకువచ్చి కళ్లాల్లో ఉంచి లారీలకు లోడింగ్ చేస్తున్నారు. బైరి, కరజాడ, రోణంకి తదితర ప్రాంతాల్లో కొబ్బరి తోటల్లో ఇసుకను డంపింగ్ చేసి రాత్రి సమయాల్లో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

మడపాంలో బలవంతంగా వసూళ్లు..

మడపాంలో నదీ తీరం నుంచి ట్రాక్టర్ ఇసుక తీసుకెళితే.. టోల్ రూపంలో రూ.100 నుంచి రూ.200

(మిగతా 6వ పేజీలో...)



మడపాంలో ఇసుక ట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న సభ్యులు

బహుమతుల ఆశ చూపి..

- వారం వారం డ్రా పేరుతో డబ్బుల వసూళ్లు
- వందలాది మంది చెల్లించిన రూ.50లక్షలతో పరారీ
- 'రణస్థలం'లో ఇన్‌స్టాల్‌మెంట్ నిర్వాహకుల దందా
- న్యాయం చేయాలని బాధితుల ఆందోళన



చిల్లపేటరాజాంలో ఆందోళన చేస్తున్న బాధితులు

రణస్థలం, నవంబరు 9 (ఆంధ్యజ్యోతి): 'ఆలస్యం చేస్తే ఆశాభంగం. ఇదే మంచి తరుణం. మా దగ్గర 16 వారాలపాటు డబ్బులు కట్టండి. వారం వారం డ్రా తీస్తాం. ప్రతి ఒక్క సభ్యుడికి విలువైన బహుమతులు అందిస్తామ'ని ఓ ఇన్‌స్టాల్‌మెంట్ నిర్వాహకులు ప్రచారం చేశారు. ప్రారంభంలో కొన్నాళ్లు.. ప్రచారం చేసిన మాదిరి బహుమతులు ఇచ్చారు. తీరా రూ.50లక్షల వరకూ వసూలు చేసి ఉడాయించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. న్యాయం చేయాలంటూ పోలీసులను వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..

రణస్థలం మండలంలో ఘరానా మోసం వెలుగుచూసింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఓ ఇన్‌స్టాల్‌మెంట్ స్కీంల పేరిట.. ప్రజలకు బహుమతుల ఆశ చూపి.. రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేశారు. రణస్థలం మండలంలోని చిల్లపేట, చిల్లపేట రాజాం, కోష్ట, బొడ్డపాడు, మెంటాడ, నారువ, దోనిపేట తదితర గ్రామాల్లో వారిద్దరూ తిరిగి.. స్కీమ్‌పై ప్రచారం చేశారు. రూ.20తో ప్రారంభమైన ఈ స్కీమ్ ప్రతివారం రూ.50 పెంచుతూ.. 16 వారాల పాటు మొత్తంగా రూ.6,020 చెల్లిస్తే.. ప్రతివారం డ్రా తీస్తామని చెప్పారు. ప్రతివారం టీవీలు, ద్విచక్ర వాహనాలు తదితర విలువైన బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. బహుమతి వచ్చిన వారు తర్వాత వాయిదాలు కట్టనవసరం లేదని చెప్పారు. ఈ మేరకు కొన్నాళ్లపాటు చిన్నచిన్న బహుమతులు అందజేయడంతో.. చాలామంది వాటికి ఆకర్షితులై నమ్మకంతో స్కీంలో చేరారు. ప్రతివారం డబ్బులు చెల్లించారు. కాగా.. రూ.20 కట్టినవారికి తొలివారంలో పది స్టీల్‌బిందెలను బహుమతులుగా అందజేశారు. రెండోవారంలో రూ.50 చెల్లించినవారికి పది వాటర్ హీటర్స్ ఇచ్చారు. మూడో వారంలో రూ.100 కట్టినవారికి పది ఇడ్లీకుక్కర్లు/ఇస్త్రీ పెట్టెలు అందజేశారు. ఆ తరువాత వారాల్లో సీలింగ్ ఫ్యాన్లు, మినీ గ్రైండర్లు, కలర్ టీవీలు, సోఫాలు, ద్విచక్ర వాహనం అని ఆశచూపడంతో కట్టిన వారితో పాటు చెల్లించిన సొమ్ము కూడా పెరిగింది. ఇలా సుమారు రూ.50లక్షలు వసూలు చేసిన ఆ ఇద్దరు నెల రోజుల నుంచి పత్తా లేకుండా పోయారు. వాయిదాలు మొత్తం చెల్లించినా బహుమతులు లేకపోవడం.. వారిద్దరూ కనిపించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ శనివారం చిల్లపేట రాజాం సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. బాధితుల్లో రోజువారి కూలీలు, నిరుపేదలే ఎక్కువగా ఉండడం గమనార్హం. వారంతా న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించనున్నారు.

● ఏదో ఒకచోట మోసం..

జిల్లాలో రోజూ ఏదో ఒకచోట ఆర్థిక మోసాలు వెలుగుచూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. కొంతమంది అత్యాశకు పోయి మోసాల బారిన పడుతున్నారు. ఆ తర్వాత పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆర్థికపరమైన అంశాలు కావడం, మోసం చేసిన వారు ఐపీ పెట్టేస్తుండడంతో ఆ కేసులు కూడా నీరుగారిపోతున్నాయి. తాము అవగాహన కల్పిస్తున్నా.. ప్రజలు మోసాలకు గురవుతున్నారని పోలీసులు చెబుతున్నారు. ప్రధానంగా ప్రజల నిరక్షరాస్యత, అవగాహన లేమిని ఆసరా చేసుకొని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ఎల్ఐసీ వంటివి పొదుపు పథకాలు ప్రారంభించినా వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ప్రభుత్వరంగ సంస్థలు సైతం పొదుపు పథకాలపై అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

● నమ్మించి మోసం



వారం వారం బహుమతులు అందిస్తుండడంతో ఎంతో నమ్మాను. కష్టపడి దాచుకున్న సొమ్ము రూ.4వేలు వరకూ చెల్లించాను. ఇప్పుడు నిర్వాహకులు కనిపించడం లేదు. పోలీసులు దర్యాప్తు చేసి మాకు న్యాయం చేయాలి.

-చిల్ల కొండమ్మ, చిల్లపేట రాజాం, రణస్థలం

● పోలీసులే న్యాయం చేయాలి



చాలా రకాలుగా నమ్మించారు. మాకు యూనికార్న్ బైక్ వచ్చిందని నమ్మబలికి రూ.20 వేలు పట్టుకుపోయారు. తరువాత కనిపించకుండా పోయారు. కష్టపడి ఇంటి అవసరాల కోసం దాచుకున్న సొమ్ము అది. మేం ఏంచేయాలి. పోలీసులు దర్యాప్తు చేసి మోసగాళ్లను పట్టుకోవాలి.

-కొణతాల అసిరితల్లి, బాధితురాలు, చిల్లపేట రాజాం, రణస్థలం



మేజర్ రాజగోపాల్ నాయుడుకు సన్మానం

సంతబొమ్మాళి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి కీర్తిచక్ర అవార్డు పొందిన సంతబొమ్మాళి పంచాయతీ నగిరిపెంటకు చెందిన మేజర్ మల్ల రాజగోపాల్‌నాయుడును గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. కీర్తిచక్ర అవార్డు పొందిన తర్వాత తొలిసారిగా ఆయన స్వగ్రామానికి వచ్చారు. గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. మారుమూల గ్రామానికి.. దేశస్థాయిలో కీర్తి తెచ్చావంటూ కొనియాడారు.

పెద్దతుంగాంలో ఎలుగు సంచారం



సంతబొమ్మాళి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం పెద్దతుంగాంలో ఎలుగుబంటి రెండు పిల్లలతో శుక్రవారం రాత్రి సంచరించడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తులంతా పెద్దఎత్తున కేకలు వేయడంతో అవి సమీపంలో కొండవైపు వెళ్లిపోయాయి. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతుండంతో పొలాలకు వెళ్లేందుకు గ్రామస్తులు భయపడుతున్నారు. అటవీ అధికారులు స్పందించి ఎలుగుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

చిట్ పేరుతో వేధింపులు

- బాధితులపై పెట్రోల్ పోసి చంపే యత్నం ● స్థానికులు రావడంతో పరారీ

8 లో

యథార్థ జీవిత అక్షర శిల్పి

- సమాజాన్ని మేల్కొపేలా రచనలు
- విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'అల్పజీవి'
- విప్లవం సృష్టించిన 'సారా కథలు'
- నేడు న్యాయవాది, రచయిత రావిశాస్త్రి వర్ధంతి

ఆయన పెన్ను పాళికి నిష్పక్షపాతంగా రాయడమే తెలుసు. యథార్థానికి దగ్గరగానే ఆయన రచనలు ఉంటాయి. వృత్తి రీత్యా న్యాయవాది. ప్రవృత్తి రీత్యా రచయిత. రచనల్లో కూడా న్యాయవాది అన్పించుకున్నారు. సమాజంలో అన్యాయాలు, దౌర్జన్యాలకు గురవుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం తరఫున వకల్తా పుచ్చుకుని రచనలు చేశారు. ఆయనెవరో కాదు. రావి శాస్త్రిగా సుపరిచితులైన రాచకొండ విశ్వనాథ శాస్త్రి. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..




రావి శాస్త్రి (ఫైల్)

ఎచ్చెర్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)

రావి శాస్త్రి అంటే సాహితీ లోకంలో తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. శ్రీకాకుళంలో సీతాలక్ష్మి, నారాయణమ్మ దంపతులకు జూలై 30, 1922లో ఆయన జన్మించారు. స్వతహాగా న్యాయవాది అయిన రావిశాస్త్రి అన్యాయాలు, దౌర్జన్యాలకు గురవుతున్న వారి తరఫున తన రచనల ద్వారా వాదించేవారు. ఉత్తరాంధ్ర జిల్లాల మాండలికాలతో సామాన్యులు మాట్లాడుకొనే భాషలో, సొగసుగా పాఠకుల హృదయాలు స్పందించేలా పదునైన రచనలు చేశారు. రావిశాస్త్రి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి తత్వ శాస్త్రంలో బీఏ (ఆనర్స్) పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుంచి 1946లో లా పట్టభద్రుడయ్యారు.

పదునైన పదజాలంతో రచనలు..

రావిశాస్త్రి రచించిన నవలల్లో 'అల్పజీవి' విమర్శకుల ప్రశంసలు పొందింది. కథాసాగరం, రాచకొండ కథలు, రాజు మహిషి, కలకంఠి, బానిస కథలు, బుక్కులు, ఆరు చిత్రాలు, రత్తాలు- రాంబాయి, సొమ్ములు పోనాయండి, గోవులోస్తున్నాయి జాగ్రత్త, బంగారం తదితర వాటిని రచించారు. అలాగే నిజం నాటకం, తిరస్కృతి, విషాదం నాటికలను రచించారు. ఆయన జీవిత చరమాంకంలో ఇల్లు అనే నవలను రాశారు. ఆయన మంచి కథకుడే కాదు, తాను రాసిన నిజం నాటకంలో, అదే విధంగా గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం నాటకంలో కూడా నటించారు. నిజం నాటకం 1962 ప్రాంతంలో 100 ప్రదర్శనలు ఇవ్వడం నిజంగానే విశేషం.





ఆకట్టుకున్న ఆరు సారా కథలు..

మద్యపాన నిషేధం చట్టం అమల్లో వచ్చిన పరిణామాలపై ఆయన కలం నుంచి జాలువారిన ఆరు సారా కథలు కథా సాహిత్యంలో ఓ విప్లవాన్ని సృష్టించింది. పాపి, మాయ, న్యాయం, మోసం, పుణ్యం, మోక్షం అనే ఆరు సారా కథలను ఆయన రాశారు. ఇవన్నీ సారా ఇతివృత్తం కలిగిన కథలే అయినప్పటికీ, ఈ కథల్లో అనేక ముఖ్యమైన మలుపులు చోటుచేసుకున్నాయి. ఈ కథలను నిశితంగా అధ్యయనం చేస్తే పెట్టుబడిదారీ విధానం కన్పిస్తుంది. పాపి కథలో రామదాసు, నీలయ్య, 'మాయ' కథలో ముత్యాలమ్మ, పెద్ద ప్లీడరు, మూర్తి లాయరు, 'న్యాయం' కథలో ముద్దాయి అమ్మాయి (పేరు లేదు), 'మోసం' కథలో రాకెట్ అప్పారావు, గురయ్య, 'పుణ్యం' కథలో పోలమ్మ, లంపెన్ ప్రోలిడేరియట్, కరుణాకరం, 'మోక్షం' కథలో మెజిస్ట్రేట్ ముఖ్యపాత్రలు. ఏకకాలంలో పాఠకునికి విభిన్న రసాల వల్ల కలిగిన అనుభూతికి శ్రీశ్రీ 'రసన' అని పేరు పెట్టారు. పాపి కథలో రామదాసు ప్రతిజ్ఞ, మాయ కథలో ముత్యాలమ్మ ప్రసంగం, న్యాయం కథలో ముద్దాయి అమ్మాయి ఆక్రందన, మోసం కథలో రాకెట్ అప్పారావు ఉపదేశం, హెడ్‌కానిస్టేబుల్ ఉపన్యాసం సాహితీ శిఖరాలుగా పేర్కొనదగినవని శ్రీశ్రీ అభిప్రాయపడ్డారు.

పురస్కారాలను తిరస్కరించిన నిస్వార్థపరుడు..


1983లో ఆంధ్రా యూనివర్సిటీ గౌరవ కళాప్రపూర్ణను ప్రకటిస్తే, దానిని రావిశాస్త్రి తిరస్కరించారు. 1966లో కేంద్ర సాహిత్య అవార్డును తిరిగి ఇచ్చివేసిన నిస్వార్థపరుడు. ఆయన కథకుడు గానే కాకుండా నటునిగా కూడా గుర్తింపు పొందారు. 1993 నవంబరు 10న సాహితీ సేవకు సెలవు చెబుతూ శాశ్వత నిద్రలోకి జారుకున్నారు రావిశాస్త్రి. విశాఖపట్నంలోని బీచ్‌రోడ్‌లో రావిశాస్త్రి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేశారు.

లెక్కల మాస్టార్

- గణితంపై భయం పోగొట్టి.. మక్కువ పెంచుతున్న తిరుపతిరావు
- అవధానిగా 255కు పైగా ప్రదర్శనలు
- పనిచేసే చోట విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ
- అవధానంపై ఆసక్తి పెంచుతున్న వైనం
- 5వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించడంతో గిన్నిస్ బుక్‌లో చోటు



అంకెలతో ఆటలు బోర్డు చూపిస్తున్న తిరుపతిరావు మాస్టారు శిష్యులు



కంచిలి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా కొందరు విద్యార్థులు లెక్కలు అంటే భయపడుతుంటారు. ఆ భయంతో మిగిలిన సబ్జెక్టులపై కూడా శ్రద్ధ చూపలేక మార్కులు తక్కువ తెచ్చుకుంటూ, చదువుపై నిరాసక్తత వ్యక్తం చేస్తుంటారు. అయితే, అన్ని సబ్జెక్టులతో పోల్చితే లెక్కలు చేయడమే చాలా సులభమని, కాస్త శ్రద్ధ చూపితే వాటితో ఆటలాడుకోవచ్చు అంటూ కంచిలి మండలం బూరగాం గ్రామానికి చెందిన లెక్కల మాస్టారు, ప్రముఖ గణిత అవధాని మడ్డు తిరుపతిరావు నిరూపిస్తున్నారు. గణిత అవధానంపై ప్రచారం చేస్తూ, తాను పని చేసే ప్రతి చోటా బాల గణిత మేధావులను తీర్చిదిద్దుతున్నారు. తెలుగులో అష్టావధాన ప్రక్రియ లాగానే గణితంలో కూడా అవధాన ప్రక్రియను సులభంగా నేర్పిస్తూ, లెక్కలపై అందరికీ మక్కువ కలిగిస్తున్న తిరుపతి మా 'స్టారు'పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి..

తిరుపతిరావు మాస్టారుది సాధారణ వ్యవసాయ కుటుంబం. స్వగ్రామం బూరగాంలో ప్రాథమిక విద్యను పూర్తిచేశారు. 10వ తరగతి, ఇంటర్ సోంపేటలో చదివారు. అనంతరం విజయనగరం మహారాజా కళాశాలలో బీఎస్సీ, ఎస్‌జే కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో బీఈడీ పూర్తి చేశారు. చిన్నప్పటి నుంచి లెక్కలంటే మక్కువ చూపిన ఆయన, అనతికాలంలోనే లెక్కల్లో విభిన్న పద్ధతులు, ప్రక్రియలను కనుగొన్నారు. విజయనగరంలో డాక్టర్ బీఎస్ఎన్ శర్మ వద్ద శిష్యుడిగా చేరి, అవధాన ప్రక్రియలో వివిధ అంశాలను నేర్చుకున్నారు. అనంతరం ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరిన అనంతరం తనలోని లెక్కల ప్రావీణ్యాన్ని విద్యార్థులకు నేర్పిస్తూ, వారిలో గణితంపై భయాన్ని పోగొట్టేందుకు కృషి చేస్తున్నారు. వృత్తిపరంగా విద్యార్థులను తీర్చిదిద్దుతూనే, లెక్కలంటే భయాన్ని పోగొట్టేందుకు ఊరూరా తిరుగుతూ అవధాన ప్రక్రియపై ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారుగా 255 ప్రదర్శనలు ఇచ్చారు.

బాల మేధావులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా..

ప్రస్తుతం కంచిలి మండలం చొట్రాయిపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తిరుపతిరావు పాఠశాలలోని పలువురు విద్యార్థులను గణిత మేధావులుగా తీర్చిదిద్దుతున్నారు. పాఠశాలలోని 27 మంది విద్యార్థుల్లో ఐదో తరగతి చదువుతున్న అందాల సంజన, బంగారు సాత్విక్‌లు స్థాన విలువలను చిటికెలో చెప్పగలరు. అలాగే నాలుగో తరగతి విద్యార్థి ఉలాల నందు గణితం, మేధా సంపత్తిపై అనేక ప్రదర్శనలు ఇచ్చాడు. మూడో తరగతికి చెందిన తుంగాన నేహా, అందాల సంజన జిల్లాల పేర్లు, రాష్ట్రాలు, వాటి రాజధానులను అడిగినదే తడవుగా చెప్పడం విశేషం. అలాగే రెండో తరగతికి చెందిన కర్రి గణపతి 22 ఎక్కాలను మంచినీళ్ల తాగినంత సులభంగా చెప్పగలడు. ఈ విద్యార్థులతో జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రదర్శనలు ఇస్తూ, అక్కడి విద్యార్థుల్లో గణితంపై భయాన్ని పోగొట్టేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థుల నైపుణ్యానికి తిరుపతిరావు మాస్టారు నేర్పించిన గణిత అవధానం ప్రక్రియలే కారణం.



ఒడిశా మాజీ ముఖ్యమంత్రికి తాను తయారు చేసిన క్యాలెండర్ అందజేస్తున్న తిరుపతిరావు(ఫైల్)

గణిత అవధానంలో ప్రక్రియలు ఇవే..

తెలుగు అష్టావధాన ప్రక్రియలాగానే గణిత అవధానంలో కూడా ఎనిమిది మంది పృచ్ఛకులు ఉంటారు. వీరంతా ఒకరి తరువాత ఒకరు అడిగే ప్రశ్నలకు అవధాని ఠక్కున సమాధానం చెబుతాడు. అయితే ఈ ప్రక్రియలో తిరుపతిరావు మాస్టారు ఆరితేరారు. ఎలాంటి ప్రశ్న వేసినా, అందరికీ అర్థమయ్యేలా, చమత్కారంగా సమాధానం చెప్పడంలో ఆయన దిట్ట. అవధానంతోపాటు మూలాలు సాధన, సమస్యాపూరణం, పంచమ మూలకం, వార గణన, దత్త భిన్నాంకం, వర్గాలు బేధంగా చెప్పడం, మనో గుణకం వంటి వివిధ అంశాలు ఉన్నాయి. వీటన్నింటినీ తాను చేయడమే కాకుండా విద్యార్థులకు నేర్పిస్తూ, వారిలో లెక్కలపట్ల మక్కువ పెంచుతున్నారు.

అవార్డులు, రివార్డులు ఎన్నో..

తిరుపతిరావు మాస్టారు.. శ్రీనివాస రామానుజన్ గణిత క్లబ్‌ను స్థాపించి జిల్లాస్థాయిలో ఎన్నో గణిత పోటీలను నిర్వహించారు. గణిత వైకుంఠపాళిని తయారు చేసి, పాఠశాలల్లో ప్రదర్శించారు. 151 సంవత్సరాల క్యాలెండర్ రూపకల్పన, పోస్టుకార్డుపై 100 సంవత్సరాల క్యాలెండర్ తయారు చేయడం ఆయన కృషికి నిదర్శనం. 5వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించడంతో ఆయన పేరు గిన్నిస్ బుక్‌లో రికార్డు అయింది. అలాగే, జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు అవార్డులతోపాటు పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఎన్నో రివార్డులు వరించాయి. సర్దార్ గౌతు లచ్చన్న స్మారక పురస్కారం సైతం ఆయన పొందారు. శతావధానం లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే ఆయన లక్ష్యం నెరవేరాలని లెక్కల ప్రియులు, ఆయన విద్యార్థులు కోరుకుంటున్నారు.

నాగావళి తీరాన్ని అందంగా మారుస్తాం

- మురుగునీటిని శుద్ధిచేసేందుకు సెవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్
- పీపీపీ మోడ్‌లో బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఆహ్వానం
- పెండింగ్ పనులకు రూ.11 కోట్లు అవసరం
- శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడి ప్రసాద్‌రావు



శ్రీకాకుళం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాగావళి నదీ తీరాన్ని అందంగా తీర్చిదిద్దుతామని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీడీ ప్రసాద్‌రావు వెల్లడించారు. శనివారం ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూ నిర్వహించింది. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: నాగావళి రివర్ వ్యూ కార్యరూపం దాల్చుతుందా?

జవాబు: శ్రీకాకుళం నగర పరిధిలో ఆదివారంపేట నుంచి పొన్నాడ వంతెన వరకు నాగావళి నది ప్రవహిస్తుంది. ఆ తీరాన్ని బ్యూటిఫికేషన్ చేసేందుకుగాను ఇటీవలే చర్యలు తీసుకున్నాం. ఇందులో భాగంగా నది ముందర భాగం(ఫ్రంట్‌వ్యూ) గట్టును అభివృద్ధి చేస్తాం. ప్రత్యేకంగా రోడ్డు నిర్మించి.. అందులోనే వాకింగ్ ట్రాక్ నిర్మిస్తాం. పార్కులను అనుసంధానం చేస్తాం. ఇందుకు సంబంధించి డీపీఆర్ సిద్ధమైంది. త్వరలో రివర్ వ్యూ కార్యరూపం దాల్చుతుంది.

ప్ర: నగరంలోని మురుగునీరంతా నేరుగా నాగావళిలో కలుస్తోంది. మురుగు నీటి శుద్ధి కేంద్రం పూర్తిచేస్తారా?

జ: గతంలో రూ.29కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రం మంజూరైంది. రూ.6కోట్ల పనులు జరిగి నిలిచిపోయాయి. మళ్లీ కొత్తగా ప్రతిపాదనలు పంపించి రూ.23 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి లేఖ రాశాం. అలాగే అమృత్2.0లో భాగంగా సెవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను 5ఎంఎల్‌డీతో నిర్మించేందుకు రూ.53 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

ప్ర: ఆస్తిపన్ను బకాయి ఎంత ఉంది?

జ: రూ.26కోట్ల ఆస్తి పన్ను బకాయి ఉంది. ఇప్పటికి రూ.12 కోట్లు వసూలు చేశాం. 45 శాతం వసూలు లక్ష్యం చేరుకున్నాం.

ప్ర: కుళాయి కనెక్షన్‌లు ఎన్ని ఉన్నాయి?

జ: నగరంలో 22,477 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. చాన్నాళ్ల నుంచి నీటిపన్ను బకాయి రూ.5కోట్లు పైబడి ఉంది. ఇప్పటివరకు రూ.60 లక్షలు మాత్రమే వసూలైంది.

ప్ర: గత ఐదేళ్లుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తారా?

జ: నాగావళి నదిలో డైక్ నిర్మాణం పాడయింది. అలాగే చాలా పనులు మధ్యలో నిలిచిపోయాయి. 424 పనులకు గాను 170 మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన పనులను జనరల్ ఫండ్‌తో పూర్తిచేసేందుకు ప్రణాళిక తయారు చేశాం. ఇందుకుగాను రూ. 11కోట్లు అవసరమని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

ప్ర: చెత్త నుంచి సంపద తయారీ వంటివి ఏమైనా చేపడుతున్నారా?

జ: ఏకంగా బయోగ్యాస్ ప్లాంట్‌ను నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టాం. పీపీపీ మోడ్‌లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నాం.

ప్ర: నగరంలో పార్కుల సంగతేంటి?

జ: ప్రస్తుతం 14 పార్కులకు గాను 10 పార్కులను ఆధునికీకరిస్తున్నాం. అలాగే కొత్తగా పార్కులను నెలకొల్పేందుకు 53 స్థలాలను గుర్తించాం. త్వరలో పార్కులన్నీ అభివృద్ధి చెందుతాయి.

ప్ర: ఇప్పటికీ నగరపాలక సంస్థకు పాత భవనమే ఉంది. ఇలాంటి భవనాలు చాలా ఉన్నాయి. వీటిని ఆధునికీకరిస్తారా?

జ: అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎసెట్ మేనేజ్‌మెంట్‌తో ఫీజుబులిటీ ఉన్న ప్రాంతాలను ఆధునికీకరిస్తాం. నగరపాలక సంస్థ భవనం, పొట్టి శ్రీరాముల మార్కెట్ కాంప్లెక్స్, బాపూజీ కళామందిర్, విజయాదిత్యపార్కులను పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేస్తాం. ఇందుకు రూ. 216 కోట్లు అవసరం. దీనివల్ల భవనాల ఆధునికీకరణతోపాటు కమర్షియల్‌గా కొంత అభివృద్ధి జరుగుతుంది.

ఉచితం మాటున.. ఇసుక దోపిడీ

(ఐదో పేజీ తరువాయి)

వరకు మామూళ్లు చెల్లించాల్సిందే. ఇందుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక విధానం ప్రకటించిన తర్వాత మడపాం వద్ద ఇసుక తవ్వకాలు చేశారు. గ్రామవీధుల నుంచి ట్రాక్టర్లు వెళ్లేందుకు గ్రామస్థులు నిరాకరించారు. దీంతో తోటలు నుంచి ఇసుక ర్యాంపుకు వెళ్లేందుకు గ్రామపెద్దలు టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ దిగితే రూ.100 చెల్లించాలి. మిగతా గ్రామానికి చెందిన ట్రాక్టర్ దిగితే రూ.200 టోల్ రుసుం వసూలు చేస్తున్నారు. ఇలా రోజుకు ఈ ర్యాంపు నుంచి 70 నుంచి 100 ట్రాక్టర్లు వరకు ఇసుక రవాణా చేయగా.. రూ.10వేల నుంచి రూ.20వేల వరకూ వసూళ్లు చేస్తున్నారు. ఈ మొత్తంలో తోట యజమానికి రూ.500 చెల్లించి.. మిగతా సొమ్మును గ్రామ పెద్దమనుషులు పంచుకుంటున్నారు. ఈ పెద్దమనుషుల్లో అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకులు ఉన్నారని తెలుస్తోంది.

పట్టించుకోని అధికారులు..

మడపాంలో అక్రమ వసూళ్లు, బుచ్చిపేటలో భారీస్థాయిలో ఇసుక నిల్వలు ఉన్నా.. అధికారులు స్పందించడం లేదు. సచివాలయ సిబ్బందికి తెలిసినా.. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం లేదు. ఇసుక దందాలో కొందరికి ముడుపులు అందుతున్న కారణంగా అక్రమాలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరు తున్నారు. ఈవిషయంపై తహసీల్దార్ సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. అక్రమ వసూళ్లు తన దృష్టికి రాలేదన్నారు. అక్రమంగా డంపింగ్ చేసి.. రవాణా చేస్తే సహించేది లేదన్నారు.

వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం తెస్తాం

- రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- కిసాన్ మేళా ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే రమణమూర్తి, శంకర్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. కేటాయించిన నిధులను ఖర్చు చేయకపోవడంతో రైతు పరిస్థితి గోరంగా మారింది. ఈ పరిస్థితిని మారుస్తాం. వ్యవసాయ రంగానికి పూర్వ వైభవం తీసుకువస్తాం'. అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్ మేళా-2024 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. 'ఆరుగాలం కష్టపడే రైతులకు తక్కువ పెట్టుబడులతో అధిక లాభాలు పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. సబ్సిడీపై యంత్రాలు, డ్రోన్లను అందిస్తాం. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ప్రతీ సంవత్సరం భూసార పరీక్షలు నిర్వహిస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖపై ప్రత్యేక దృష్టి పెట్టారు. మార్టేరును తలదన్నేలా రాగోలు పరిశోధన స్థానాన్ని అభివృద్ధి చేస్తాం. శ్రీకాకుళం సన్న బియ్యానికి ప్రపంచ ఖ్యాతి వచ్చేలా కృషి చేస్తాం. పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. నా శాఖకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరుతా. జిల్లా నుంచి వలసలను నివారిస్తాం.' అని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు డ్రోన్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. రైతులు గ్రూపులుగా ఏర్పడి వాటి సేవలు తక్కువ ధరకు పొందవచ్చని చెప్పారు. పాఠశాల స్థాయి విద్యార్థులు కూడా తరచూ ఇలాంటి మేళాలకు హాజరై కొత్త విషయాలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్ మాటాడుతూ.. లాభసాటి వ్యవసాయ విధానాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నైపుణ్య అభివృద్ధికి సాంకేతికతను జోడించి యువతను ఈ రంగం వైపు ఆకర్షితులయ్యేలా ప్రోత్సహించాలని కోరారు. తొలుత వివిధ శాఖలు ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తి ప్రదర్శనలను మంత్రి తిలకించారు. వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై ప్రచురించిన పలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.ఆర్.శారద, జయలక్ష్మి దేవి, పరిశోధన సంచాలకుడు పీవీ సత్యనారాయణ, విస్తరణ సంచాలకుడు డా.జి.శివనారాయణ, వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ సీహెచ్ శ్రీనివాసరావు, సీడ్స్ డైరెక్టర్ వై.సతీష్, జిల్లా వ్యవసాయ అధికారి కె.త్రినాథస్వామి, డాక్టర్ ధానేటి శ్రీధర్, ఉత్తరకోస్తా మండల వ్యవసాయ శాఖాధిపతులు, జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రాతో గట్టెక్కిన ఆంధ్ర

- అర్ధ సెంచరీలతో రాణించిన భరత్, విహారి, కరణ్‌షిండే



బ్యాటింగ్ చేస్తున్న హనుమవిహారీ

విజయనగరం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు డ్రాతో గట్టెక్కింది. విజయనగరం సమీప చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో ఆంధ్రా-ఉత్త రాఖండ్ రంజీ క్రికెట్ మ్యాచ్ నాలుగు రోజులుగా జరుగుతోంది. చివరి రోజు ఆటలో ఓవర్‌నైట్ స్కోర్ 8/1తో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు 93 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసింది. విజయానికి మరో 35 పరుగులు కావాల్సి ఉండగా, చేతిలో నాలుగు వికెట్లు ఉన్నాయి. ఈ సమయంలో వెలుతురు లేమి కారణంగా అంపైర్లు ఆటను నిలిపివేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆంధ్రా జట్టులో ఓపెనర్ హేమంత్‌రెడ్డి (2), కెప్టెన్ రషీద్ (31), కరణ్‌షిండే (65), హనుమ విహారీ(66), భరత్ (90 బంతుల్లో 92 పరుగులు) చేశారు. ఉత్తరాఖండ్ బౌలర్లలో ధపోలా 5 వికెట్లు, ఆదిత్య తారే ఒక వికెట్టు పడగొట్టారు.

23 నుంచి 'సూర్య దర్శనమ్'

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ సామవేదం షన్ముఖ శర్మచే ఈ నెల 23 నుంచి సూర్యదర్శనమ్ ప్రవచన యజ్ఞం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నగరంలోని బాపూజీ కళామందిరంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ప్రవచనాలు ఉంటాయన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. శనివారం మెట్టక్కివలసలో అవగాహన కార్య క్రమం నిర్వహించారు. యాదవ సంఘం అధ్యక్షుడు నాగళ్ల మురళీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాల శోధనలో నైపుణ్యమే కీలకం

● శిక్షణ తరగతుల్లో ఎస్పీ మహేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి.. శిక్షణలో పాల్గొన్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో అధిక సంఖ్యలో జరుగుతున్న సైబర్ మోసాలు అరికట్టేందుకు, కేసులు సులభతరంగా ఛేదించేందుకు సాంకేతిక నైపుణ్యంతోపాటు శోధన ఎంతో కీలకమని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. రూరల్ మండలం ముసలుపేట గ్రామంలో ఉన్న గురజాడ విద్యా సంస్థలో పోలీసు అధికారులకు సైబర్ నేరాల దర్యాప్తులో చేపట్టాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన చర్యలు, సాంకేతిక నైపుణ్యంపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నైపుణ్యం అనేది నిరంతర ప్రక్రియ ద్వారా లభిస్తుందని, కేసు ఛేదనలో ప్రతీ అంశాన్ని కీలకంగా తీసుకోవాలన్నారు. హ్యూమన్ ఇంటలిజెన్స్‌తో కేసులు చాకచక్యంగా ఛేదించవచ్చన్నారు. ప్రస్తుతం నేరాల తీరు మారుతుందని, ప్రతీ నేరం సైబర్‌క్రైం, సాంకేతికతతో ముడిపడి ఉందన్నారు. ఈ నేరాలను ఛేదించేందుకు ప్రత్యేకమైన శిక్షణ, వృత్తి నైపుణ్యం అవసర మన్నారు. దీనిని మెరుగుపరుచుకుంటే సైబర్ నేరాలు ఛేదించవచ్చన్నారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని సాంకేతిక నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుని భవిష్యత్తులో పోలీసు శాఖకు సవాల్‌గా నిలిచే సైబర్ నేరాలు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ కోరారు. సైబర్ నిపుణులు సాయి రామానుజ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు ఛేదించడం సులభతరమని అందుకు అవసరమైన అవగాహన వృత్తి నైపుణ్యం దర్యాప్తు అధికారులకు అవసరమన్నారు. అనంతరం సైబర్ నిపుణులు సాయి రామా నుజను ఎస్పీ సత్కరించారు. సమావేశంలో టౌన్ డీఎస్పీ జీహెచ్ వివేకానంద, ఉమెన్ డీఎస్పీ రాజశేఖర్, గురజాడ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు స్పష్టం చేశారు. ఈ మేరకు కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాధికారులతో శుక్రవారం సమీక్షించారు. కథా నిలయం అధ్యక్షుడు కాళీపట్నం సుబ్బారావు పంపిణీ చేసిన పుస్తకాలతోపాటు రావి సీతాదేవి, రావి గౌరీ నాగేశ్వరి రచించిన పుస్తకాలను జిల్లాలో అన్ని గ్రంథాలయాలకు సరఫరా చేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, గ్రంథపాలకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడురోడ్ల కూడలిలో గల ఎన్‌టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలురు, బాలికలు బాస్కెట్ బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. అదేవిధంగా ఇక్కడి కోడి రామ్మూర్తి స్టేడియంలో జిల్లాలో మొట్టమొదటిసారిగా మోడరన్ పెంటాథలిన్ పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలు హోరా హోరీగా జరుగుతుండగా బాలికల విభాగంలో నెల్లూరు జట్టుపై శ్రీకాకుళం విజయం సాధించగా, కడపపై గుంటూరు, విజయనగరంపై చిత్తూరు, విశాఖపై ప్రకాశం, కడపపై శ్రీకాకుళం, విజయనగరంపై తూర్పుగోదావరి జట్లు విజయం సాధించాయి. బాలుర విభాగంలో చిత్తూరుపై నెల్లూరు, కడపపై విశాఖ, శ్రీకాకుళంపై తూర్పుగోదావరి జట్లు విజయాలు సాధించాయి. అదేవిధంగా మోడరన్ పెంటాథలిన్‌లో అండర్-17 విభాగంలో 1200 పరుగు, 100 మీటర్ల స్విమ్మింగ్, మరలా 1200 మీటర్ల పరుగుతో ఈవింగ్ కొనసాగించగా, అండర్-19 విభాగంలో 1600 మీటర్ల పరుగు, 200 మీటర్ల స్విమ్మింగ్ మరలా 1600 మీటర్ల పరుగుతో ఈవింట్‌ను కొనసాగించారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ తెలియజేశారు. ఈ పోటీలు జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

అన్ని రంగాల్లో అభివృద్ధి

లావేరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం శహపురం, బుడతవలస, వెంకటరావు పేట గ్రామాల్లో పల్లెపండగ ద్వారా చేపట్టిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. శహపురంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితుడు బోర ముసలయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10 వేలు అందజేశారు. కూటమి నాయకులు ముప్పిడి సురేష్, తోటయ్య దొర, అలుపన సూర్యనారాయణ, ముల్లు సాయి తదితరులు పాల్గొన్నారు.

● ఎచ్చెర్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు నడుకుదిటి ఈశ్వరరావు, గొండు శంకర్ అన్నారు. ఎచ్చెర్లలో రిటైర్డు వీఆర్వో జరుగుళ్ల వెంకటరమణ నాయుడు సొంత నిధులతో నిర్మించిన బస్‌షెల్టర్‌ను శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు మెండ రాజారావు, పొందూరు భీమారావు, కూటమి నేతలు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

పూడ్చిన గొయ్యి



పూడ్చివేసిన గొయ్యి

లావేరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): సుభద్రాపురం జంక్షన్ వద్ద చీపురుపల్లి వెళ్లే మార్గం వైపు పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో ఆటు వైపుగా వెళ్లే ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురయ్యేవారు. ఈ విషయంపై ఇటీవలన 'ఆంధ్రజ్యోతి'లో 'ఈ గోతిని పూడ్చరూ' అనే శీర్షిక ప్రచురితమైన కథనానికి హైవే అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చారు.

ప్రముఖ న్యాయవాది మృతి



దేవరాజ్ (ఫైల్)

ఇచ్ఛాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రాజకీయ నాయకులు, హైకోర్టు న్యాయవాది కాళ్ల దేవరాజ్ (63) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. అతడి మృతిపై ప్రముఖులు, న్యాయవాదులు, డాక్టర్లు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు. శనివారం నిర్వహించిన అంతమయాత్రలో పలువురు పాల్గొని నివాళులర్పించారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి పరామర్శించారు.

రుణాలు పొందితేనే ఇన్సూరెన్స్

ఇచ్ఛాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి రుణాలు పొందిన మహిళా సంఘ సభ్యులకు ఇన్సూరెన్స్ సదుపాయం కూడా ఉందని ఏపీఎం ననపనల ప్రసాద్ అన్నారు. శనివారం మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

ఓటర్ల నమోదు

ఆమదాలవలస, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో శనివారం ప్రత్యేక ఓటర్లు నమోదు నిర్వహించారు. 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఈ ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాన్ని 49, 50 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

కవిటి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి 104 ఉద్యోగులు తమ సమస్యలు తీసుకువెళ్లారు. ఈ మేరకు శనివారం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో నెం.7 ప్రకారం సకాలంలో జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, సీనియర్ ఉద్యోగులను స్లాబ్ సిస్టమ్ అమలు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా అతి తక్కువ వ్యయంతో 104 వాహనాలను ప్రభుత్వమే నడిపేలా చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని 104 ఉద్యోగులు రాము, రాజేంద్ర, సంతోష్, రాజేశ్వరి, వసంత తెలిపారు.

అపార్ వేగవంతం చేయండి

కంచిలి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): అపార్‌ను వేగవంతం చేయాలని ఎంఈవో కె.చిట్టిబాబు అన్నారు. శనివారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అపార్ జనరేట్ చేయడంలో జాప్యం జాప్యం జరుగుతుందని, వేగవంతం చేయాలని సూచించారు. అపార్ నమోదు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామని నిర్లక్ష్యం చేస్తు చర్యలు తప్పవన్నారు. నమోదులో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. హెచ్‌ఎంలు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వృత్తి విద్యా శిక్షణపై దృష్టిసారించాలి

ఆమదాలవలస, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): వృత్తి విద్యా శిక్షణపై శాస్త్రవేత్తలు దృష్టిసారించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. విస్తరణ కార్యక్రమాల అమలులో చేపట్టాల్సిన చర్యలను శాస్త్రవేత్తలకు వివరించారు.

ప్రతి ఒక్కరూ గో సేవ చేయాలి



గో పూజలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి తదితరులు

రణస్థలం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గో సేవ చేయాలని శ్రీ కృష్ణ చైతన్య మిషన్ అధ్యక్షుడు స్వామి కేశవమహరాజ్ అన్నారు. కోష్ట గ్రామానికి సమీపాన ఉన్న గోశాల వద్ద శనివారం గోపాష్టమి వేడుకలు సందర్భంగా సుదర్శన యజ్ఞనం, గో పూజ, గో పరిక్రమ చేశారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు గోపూజలు చేశారు. యోగ శాలకు శంకుస్థాపన చేశారు. యోగశాల నిర్మాణం కోసం ఒక్కనెల జీతం ఇస్తున్నట్టు ప్రకటించారు. భక్తులు కార్తీక అన్నసమారాధనలో పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గోపాష్టమి సందర్భంగా పెద్ద జగన్నాథస్వామి ఆలయంలో గోపూజ ఘనంగా జరిపారు. శనివారం కస్పాగౌడవీధి, ఒరియా వీధులకు చెందిన మహిళలు పాల్గొని గోవులకు పూజలు చేశారు. అర్చకులు పద్మకుమార్, ఎండోమెంట్ అధికారి రామారావు పాల్గొన్నారు.

14న క్రికెట్ జట్టు ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో ఈ నెల 14వ తేదీన అండర్-12 బాలుర జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు పుల్లెల శాస్త్రి, కార్యదర్శి హాసన్‌రాజా, ట్రెజరర్ ఎంఎస్‌కే శైలానీలు కోరారు. 2012 సెప్టెంబరు తర్వాత జన్మించిన వారై, ఆధార్, జనన ధ్రువ పత్రాలతోపాటు వైట్ యూనిఫారం, కిట్‌తో హాజరు కావాలని కోరారు.

బ్యాడ్మింటన్ అంపైర్‌గా సాయినాథ్

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బ్యాడ్మింటన్ అంపైర్‌గా సంపతి రావు మోహన్ సాయినాథ్ అర్హత సాధించాడు. చెన్నైలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి అంపైరింగ్ పరీక్షలో ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం గ్రామానికి చెందిన సాయినాథ్ అతిపిన్న వయస్సులో ఎంపిక కావడం విశేషం. ఇదిలా ఉండగా, ఇతని తండ్రి ఎస్.సూరిబాబు అంతర్జాతీయ స్థాయి అంపైర్‌గా పలు పోటీల్లో పాల్గొంటున్నారు. అంపైర్‌గా అర్హత సాధించడంపై అభినందించారు.

రూ.10 వేలు సాయం

సోంపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పాతినవలసకు చెందిన తెలుకుల ప్రశాంత్ డాబాపై నుంచి జారి పడిన ఘటనలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న తాళ్లభద్ర యువజన సేవా సంఘం సభ్యులు శనివారం రూ.10 వేలు సాయాన్ని అందించారు. ప్రతినిధులు గణపతి, సింహాచలం, ఈశ్వరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు

ఆమదాలవలస, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఇరిగేషన్ పనులు చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్టు టీడీపీ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నుంచి హై ప్రయార్టీ ఇరిగేషన్ పనులు చేపట్టేందుకు రూ.39.39 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు.

దాడులు హేయం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ శ్రేణులపై టీడీపీ కూటమి నాయకుల దాడులు పెరిగిపోయాయని, ఈ దాడులు అత్యంత హేయమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జిల్లాలో వైసీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అడ్డుకట్ట వేయాలని, దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ పి.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందించారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్: చిట్ పేరుతో వేధింపులు

- బాధితులపై పెట్రోల్ పోసి చంపే యత్నం
- స్థానికులు రావడంతో పరారీ



రమ భర్తతో వాగ్వాదం చేస్తున్న మేనేజర్ మణికంత

శ్రీకాకుళం రూరల్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న సంస్థలోనే చిట్ వేసుకుని.. అవసరాలకు ఇప్పించాలని కోరితే సొమ్ము ఇవ్వకుండా అప్పు రూపంలో అవసరం తీర్చి.. ఇప్పుడు అధిక వడ్డీ చెల్లించాలంటూ ఓ చిట్ ఫండ్ మేనేజర్ వేధించడంతో పాటు చిట్ కోసం నిలదీశారన్న నెపంతో రౌడీమూకలతో వెళ్లి బాధితులను పెట్రోల్ పోసి చంపేందుకు ప్రయత్నించిన ఘటన శనివారం నగరంలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ప్రకాష్ నగర్ కాలనీలో ఉంటున్న కరకవలస రమ 2012 నుంచి 2024 వరకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ చిట్స్ బ్రాంచ్-1లో ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేస్తుండేది. తన భర్త సత్యనారాయణ మేనకోడలు వివాహం సమయానికి ఎక్కువ మొత్తంలో డబ్బు సమకూర్చుకునేందుకు బ్రాంచ్‌లో రూ.25 లక్షల చిట్టీ కట్టేందుకు సిద్ధమైంది. అయితే సొంత బ్రాంచ్‌లో చిట్టీ కట్టకూడదని అక్కడి మేనేజర్ బ్రాంచ్-2కి సిఫార్సు చేశారు. దీంతో ఆమె తన భర్తతో కలిసి బ్రాంచ్-2 మేనేజర్‌ను ఆశ్రయించింది. అయితే సంస్థలో పనిచేస్తున్నందున రమతో పాటు భర్త పేరు మీద కూడా చిట్టీ వేయకూడదని మేనేజర్ చెప్పారు. దీంతో తన మేన కోడలు పెళ్లి నాటికి చిట్టీ ఇస్తామని మేనేజర్ హామీ ఇవ్వడంతో రమ తన భర్త బిజినెస్ పార్టనరైన కిల్లి గుణశేఖర్ పేరు మీద రూ.25 లక్షల చిట్టీ వేసి.. నెలకు రూ.50 వేలు చెల్లించేది. ఈ క్రమంలో సత్యనారాయణ తన మేనకోడలికి 2023 మేలో పెళ్లి ఉందని డబ్బులు ఇప్పించాలని మేనేజర్‌ను పెళ్లికి ముందు మూడు నెలలుగా బతిమలాడారు. అయితే చిట్టి డబ్బులు ఇవ్వకపోగా విశాఖ ఎన్ఏడీ బ్రాంచ్‌లో తనకు తెలిసిన వారి చిట్టి డబ్బులు రూ.7లక్షలు రమ భర్తకు ఇప్పించారు. మొత్తం 50 వాయిదాలకు గాను 31 వాయిదాలు చెల్లించినట్లు బాధితులు పేర్కొన్నారు. పెళ్లి తర్వాత చిట్టి డబ్బులు ఇప్పించాలని కోరగా.. ప్రస్తుతం తక్కువ వస్తుందని అందాక వడ్డీ కట్టేయమని మేనేజర్ ఒప్పించాడు.

అధిక వడ్డీ పేరుతో వేధింపులు

ఇచ్చిన డబ్బులకు వడ్డీ కడుతున్నప్పటికీ ఓ వైపు చిట్టి డబ్బులు ఇవ్వాలని రమ అడుగుతుంటే తప్పించుకునే ధోరణి పట్టిన మణికంఠ.. గడిచిన మూడు నెలలుగా అప్పు ఇప్పించిన డబ్బులు ఉన్నఫలంగా చెల్లించాలని, లేకుంటే అధిక వడ్డీ చెల్లించాలని బాధితులను వేధించడం ఆరంభించాడు. ఇటీవల అర్ధరాత్రి రమకి ఫోన్ చేసి గుంటూరులో నీ కొడుకు చదువుతున్నాడు కదా.. అక్కడికి వెళ్తానంటూ బెది రించాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఆ మేనేజర్.. ముగ్గురు వ్యక్తులను వెంటబెట్టుకుని రమ ఇంటికి వెళ్లి డబ్బులు కట్టాలంటూ బెదిరించారు. చిట్టి పాడి మీ డబ్బులు ఇచ్చేస్తానని ఆమె చెప్పినా వినిపించుకోకుండా తన బ్యాగులో తెచ్చిన పెట్రోల్ బాటిల్ తీసి రమతో పాటు ఆమె భర్త సత్యనారాయణపై పోసి తగలబెట్టేందుకు యత్నించాడు. దీంతో ప్రాణ భయంతో వారిద్దరూ అరుస్తూ వీధిలోకి పరుగులు తీశారు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని ఎదురు తిరిగే సరికి వారంతా అక్కడి నుంచి పరారయ్యారు. ఈ విషయమై భయంతో రెండో పట్టణ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయగా, సీఐ ఈశ్వరరావు దాడికి పాల్పడిన వారికి ఫోన్ చేసి రమ్మని పిలిచారు. విశాఖలో ఉన్నామని సోమవారం వస్తామంటూ బదులిచ్చారు. దీంతో తమకు ప్రాణ రక్షణ కల్పించాలంటూ రమ ఫిర్యాదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

రేషన్ కందిపప్పు పంపిణీపై ఫిర్యాదు

నరసన్నపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): చెన్నాపురం గ్రామంలో డీలర్లు కందిపప్పు కొందరికే పంపిణీ చేసి, మిగిలిన కందిపప్పును పక్కతోవ పట్టించారని పలువురు గ్రామస్థులు ఫిర్యాదు చేయగా శనివారం గ్రామంలో వీఆర్వో, సివిల్ సప్లయ్స్ అధికారులు ఆరా తీశారు. దీనిపై విచారణ చేపట్టి తగు చర్యలు చేపట్టనున్నట్లు సీఎస్‌డీటీ రామకృష్ణ తెలిపారు.

వేతనాలొచ్చాయ్..

- ఆనందంలో 108, 104, 102 సిబ్బంది



నరసన్నపేట/హిరమండలం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ప్రజలకు అండగా ఉంటూ ప్రాణాలను కాపాడడంలో ముందుండే 108, గ్రామాల్లో వైద్య సేవలందించే 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 సిబ్బందికి రెండు నెలల బకాయిలను తక్షణం చెల్లించాలని ఆయా నిర్వహణ సంస్థలకు ప్రభుత్వం ఆదేశించడంతో రెండు నెలల వేతనాలను శనివారం చెల్లించారు. మూడు నెలలకు బకాయిలుండగా ప్రస్తుతం రెండు నెలల బకాయిలను అందించారు. దీంతో ఆయా ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై కూటమి ప్రభుత్వం స్పందించడంతో వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. బకాయిలు చెల్లించాలని వీరంతా ఇటీవల ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. జిల్లాలో 108 వాహనాలు 31 ఉండగా ఉద్యోగులు, రిలీవర్లు కలిపి 150 మంది ఉన్నారు. 104 వాహనాలు 53 ఉండగా, వాటిలో 114 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అలాగే 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌కు 18 ఉండగా వీటిలో ఒక్క డ్రైవర్ మాత్రమే ఉంటారు. అయితే జిల్లాలో నలుగురు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరందరికీ ఆగస్టు, సెప్టెంబరులకు గాను వేతనాలు చెల్లించేందుకు రంగం సిద్ధం చేయగా మిగిలిన నెలకు చెందిన వేతనాన్ని ఈనెల 14లోగా చెల్లించేలా కూటమి ప్రభుత్వం చొరవతీసుకుంది.

రెండు నెలలు వేతనాలు విడుదల

వేతనాల కోసం సిబ్బంది పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీంతో ఆగస్టు, సెప్టెంబరు వేతనాలను విడుదల చేశారు. మరో రెండు రోజుల్లో మిగతా బకాయిలు చెల్లింపులు జరుగుతాయని ఆదేశాలు వచ్చాయి.

-యు.లక్ష్మణరావు, 104 ఇన్‌చార్జి

ఆనందంగా ఉంది

మా బకాయిలపై కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడం ఆనందంగా ఉంది. రెండు నెలల వేతనాలు చెల్లించారు. ఒక్క నెల బకాయి ఉంది. అది త్వరలోనే వస్తుంది.

-పాపారావు, 108 వాహన డ్రైవర్

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే శిరీష



వజ్రపుకొత్తూరు: కొండపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం స్థానిక 2వ వార్డులో రూ. 5 లక్షల సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, నేతలు దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, డొక్కరి శంకర్, జోగ మల్లి, దడియాల నర్సింహులు, మల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు. ● నూతన భవనాల్లోకి మార్చిన జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. మదర్ థెరిసా విద్యాలయం ఆవరణలో ఈ పాఠశాల తరగతులు జరుగుతాయన్నారు.

గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ

పలాసరూరల్,నవంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కిష్టుపురంలో శనివారం సీసీ రోడ్డును శనివారం ప్రారంభించారు. అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ఉత్తమ నియోజక వర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్ కుమార్, నాయకులు పీరికట్ల విఠల్, దువ్వాడ సంతోష్ కుమార్, కృష్ణంరాజు, బాబూరావు, నాగరాజు, ఎంపీడీవో వసంత్‌కుమార్, ఏపీవో జె.శంకరరావు పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెడితే చర్యలు

వజ్రపుకొత్తూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మహిళలు, కూటమి ప్రభుత్వంపై తప్పుడు పోస్టులు పెడితే బాధ్యులపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. శనివారం కొండపల్లిలో సీసీ రోడ్ల పనులకు భూమి పూజ నిర్వహించారు. మండలంలో కొందరు వైసీపీ నేతలు సోషల్ మీడియా లో వ్యక్తులను కించపరుస్తూ పోస్టులు పెడుతున్నారని స్థానిక నాయకులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఆమె స్పందిస్తూ.. ఎటువంటి భయం లేకుండా ఇటువంటి పోస్టులు పెట్టిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయా లని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షుడు అర్సవెల్లి ఉమా, మాజీ వైస్ ఎంపీపీ దాసరి జేజేరావు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్, ఎంపీ టీసీ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి: బగ్గు



ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి సత్కరిస్తున్న రోణంకి కృష్ణంనాయుడు

నరసన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పదవితో మరింత బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. కళింగ కార్పొరేషన్ చైర్మన్ పదవికి ఎంపికైన రోణంకి కృష్ణంనాయుడు శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగు గుర్తింపు ఇస్తుందని, వారికి దశల వారీగా పద వులు వస్తాయన్నారు. కార్యకర్తల సంక్షేమానికి పార్టీఎంతో శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యతో ఉత్తమ భవిష్యత్తు



బోధనా సామగ్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాసరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో తానా ఫౌండేషన్ (అమెరికా) సభ్యుడు గోరంట్ల వాసుబాబు అందించిన సైన్స్, సోషల్, మ్యాథ్స్ బోధనోప కరణాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యావిహార్ ఉత్తమ ఆధ్యాత్మిక విద్యను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. గోవిందరాజులు, డోకి రామారావు, ట్రస్టు చైర్మన్ మల్లా రామే శ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, శరత్, శ్రీను పాల్గొన్నారు.

సెంచూరియన్ యూనివర్సిటీలో ప్లేస్‌మెంట్ డ్రైవ్



విద్యార్థులకు జాబ్ పత్రాలందిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పర్లాకిమిడి సమీపం లోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సాగింది. ఐటీసీ లిమిటెడ్ అగ్రి బిజినెస్ డివిజన్ నిర్వహించిన ఈ డ్రైవ్‌లో ఒక్కో విద్యార్థికి రూ.4 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫె సర్, డాక్టర్ డీఎన్ రావు, ప్రొఫెసర్ సుప్రియా పట్నాయక్, వీసీ అనితా పాత్రో తదితరులు అభినందించారు.

సాగుకు 'ఉపాధి'ని అనుసంధానం చేయాలి

కొత్తూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథ కాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ధాన్యం విక్ర యాల సమయంలో దళారులను నమ్మవద్దన్నారు. ఉపాధి పథకం ద్వారా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఏపీవో ప్రేమలత తెలిపారు, గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పనులు చేయడం లేదని ఏఈ మోహన్‌రావు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో నీరజ, తహసీ ల్దార్ రవిచంద్ర, సీఎస్‌డీటీ భీమారావు, ఏఈ దుర్గా ప్రసాద్, ఏపీఎం లలిత, డాక్టర్ సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ విధానాలను కొనసాగిస్తే ప్రతిఘటన తప్పదు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కాశీబుగ్గ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలను కూటమి ప్రభుత్వం కొనసాగిస్తే ప్రతిఘటన తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కాశీబుగ్గలో శనివారం పార్టీ 18వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల నిర్ణయాన్ని ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. చార్జీల పెంపువల్ల యూనిట్‌కు రూ.1.80 పైసల నుంచి రూ.2.40 అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోస్టల్ కారిడార్ పేరుతో సముద్రతీర భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు చేస్తున్నాయని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వం రంగంలోనే కొనసాగించాలని, ప్రైవేటీకరణ చేస్తే పోరాటం తప్పదని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.తులసీదాస్ మాట్లాడుతూ జిల్లా ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, నాయకులు కృష్ణమూర్తి, సింహాచలం, నాగమణి, షణ్ముఖరావు, తేజేశ్వరరావు, ప్రసాద్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: 8మందికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

నందిగాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆకుల రఘునాథపురం సమీపంలో హైవేపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 9మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం రూరల్ మండలం పాత్రునివలస గ్రామానికి చెందిన మహిళలు ఆలయాల దర్శనం నిమిత్తం ఆటోలో వస్తున్నారు. ఆకులరఘునాథపురానికి వచ్చే సరికి రూటు మరిచి పోయి వచ్చేశామని డ్రైవర్ గుర్తించి ఆటోను వెనక్కు తిప్పుతుండగా రౌతపురం గ్రామానికి చెందిన పూతి చిరంజీవి తన వరుసకు చిన్నాన్న అయిన ధర్మారావుతో కలిసి ద్విచక్రవాహనంపై నరసన్నపేట వెళ్లి తిరిగి వస్తూ ఈ ఆటోను ఢీ కొన్నారు. దీంతో ఆటో బోల్తాపడింది. ద్విచక్రవాహనంపై ఉన్న పూతి చిరంజీవి, ధర్మారావుతో పాటు ఆటో డ్రైవర్ మున్సబుపేటకు చెందిన రాజు, పాత్రునివలసకు చెందిన రాము లమ్మ, జగదీశ్వరి, మరో ముగ్గురు మహిళలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో చిరంజీవి, ధర్మారావు తదితరులకు మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. నందిగాం 108 వాహన సిబ్బంది కుమారస్వామి, పి.గోపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. ధర్మారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు.

ప్రభుత్వంపై మాట్లాడే అర్హత తిలక్‌కు లేదు

కోటబొమ్మాళి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వంపై మాట్లాడే అర్హత వైసీపీ నాయకుడు తిలక్‌కు లేదని ఏపీ బీజేపీ పొలిటికల్ ఫీడ్‌బ్యాక్ విభాగం సభ్యుడు హనుమంతు ఉదయ్ భాస్కర్ అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మాట్లాడడం సరికాదన్నారు.

శ్రీముఖలింగంలో భక్తుల సందడి

జలుమూరు, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి) సుప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగేశ్వరాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక బహుళ అష్టమి శనివారం భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు.

'తెప్పల'కు కవితా పురస్కారం

పలాసరూరల్,నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన గోదావరి కవనోత్సవం శతాధిక కవిసమ్మేళనంలో పలాసకు చెందిన జనజాగృతి సాహితీ సంస్థ గౌరవాధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తికి పురస్కారం అందించారు. 'వృద్ధాప్యమూ వరమే' అనే అంశంపై ఆయన కవితాగానం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు కవులు, కళాకారులు హర్షం వ్యక్తంచేశారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పలాసరూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): టెక్కలిపట్నంలో ఆదివారం ఉదయం చంద్రశేఖర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆగమ పండితుడు పాలవలస రామకృష్ణ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.20 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందని, భక్తులు పాల్గొనాలని కోరారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జ్వరాలపై వైద్యఆరోగ్య సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డా. టి.శ్రీకాంత్ సూచించారు. శనివారం పోతయ్యవలసలో నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో వాన సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ: రైతు సమస్యల పరిష్కారానికే సాగునీటి సంఘాలు

- ఎం.సురేష్‌కుమార్, తహసీల్దార్



పోలాకి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికే సాగునీటి సంఘాలని, వాటి ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు.

ప్రశ్న: మండలంలో సాగునీటి సంఘాలు ఎన్ని ఉన్నాయి?

జవాబు: 9 సాగునీటి సంఘాలున్నాయి.

ప్రశ్న: గతంలో ఈ సంఘాలకు ఎప్పుడు ఎన్నికలు జరిగాయి?

జ: 2006లో జరిగాయి. 2017లో జరగాల్సిన ఎన్నికలు వాయిదాపడ్డాయి.

ప్ర: ఒక్కో సంఘంలో ఎంతమంది సభ్యులుంటారు?

జ: ఒక సంఘానికి 12 మంది ఉంటారు.

ప్ర: సంఘంలో ఓటర్లు ఎంతమంది?

జ: గత ఓటరు జాబితా ప్రకారం ఏడు వేల మంది ఓటర్లున్నారు.

ప్ర: కొత్త జాబితాను తయారైందా?

జ: వీఆర్వోల ద్వారా సమాచారం సేకరించి ఓటరు జాబితా రూపొందిస్తున్నాం.

ప్ర: తుదిజాబితా ఎప్పుడు ప్రదర్శిస్తారు?

జ: ఈ నెల 11, 12 తేదీల్లో అభ్యంతాలు స్వీకరించి 13న జాబితా ప్రదర్శిస్తాం.

ప్రశ్న: సాగునీటి సంఘం బాధ్యతలేంటి?

జ: ఈ సంఘాల ఆధ్వర్యంలో రైతు సమస్యలు తీర్చాలి. వాటర్ టాక్స్, సాగునీటి కొరత లేకుండా బాధ్యత వహించాలి.

న్యూస్ బాక్స్

ఓటరు జాబితాల్లో అర్హులను చేర్చాలి

ఎల్.ఎన్.పేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో చేర్చాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ అన్నారు. లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. రెవెన్యూ కార్యదర్శి ఎల్.తిరుమలరావు, బీఎల్వోలు పాల్గొన్నారు.

మృతుల పేర్లు తొలగించాలి

జలుమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) ఓటరు జాబితాలోని మృతులు, వివాహమై ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగించాలని తహసీల్దార్ జె.రామారావు తెలిపారు. లింగాలవలస పోలింగ్ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. గ్రామంలోని ఓటర్లు వరుస క్రమంలో ఉండేలా బీఎల్వోలు చర్యలు చేపట్టాలన్నారు. ఒకే కుటుంబం ఓట్లు ఒకేచోట ఉండాలన్నారు. డీటీ మధుబాబు, హెచ్ఎం అప్పలసూర్యానారాయణ పాల్గొన్నారు.

వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

నరసన్నపేట, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): ఇసుక డంపింగ్ కేంద్రాల నుంచి ఇసుకను ఎక్కడికి రవా ణా చేస్తున్నారో ఆ వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని ఆర్డీవో సాయిప్రత్యూష సూచించారు. శనివారం గోపాలపెంట ఇసుక డంపింగ్ యార్డును పరిశీలించారు. తహసీల్దార్ సత్యనారాయణ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో సరుకులందించాలి

జలుమూరు, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి) నిత్యావసర సరుకులను సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆర్డీవో కె. సాయి ప్రత్యూష ఆదేశించారు. పెద్దదూగాంలో శనివారం నిత్యావసరాల పంపిణీ వాహనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ జన్ని రామారావు, డీటీ మధుబాబు, పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక బోధనలతో శాంతి

పాతపట్నం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక బోధనలతో శాంతి నెలకొంటుందని రిటైర్డ్ జేసీ పి.రజనీకాంతరావు అన్నారు. కొరసవాడ ఆంధ్రాబాప్టిస్ట్ చర్చిలో శనివారం కృతజ్ఞతార్పణ పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ రీడింగ్ రూంను ప్రారంభించారు. విశాఖకు చెందిన పాస్టర్ స్టీవెన్ పీటర్, పాస్టర్ ఫిలిప్, అనిల్ కుమార్, సతీష్ బెహరా పాల్గొన్నారు.